క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే...గుమ్మళ్లదొడ్డు గ్రామానికి చెందిన ఆడారి శివకృష్ణ మోహన్‌బాబు (37) ఈ నెల 9 మోటార్ సైకిల్‌పై జగ్గంపేట వైపు వస్తుండగా మండలంలోని తాళ్లూరు వద్ద అదుపు తప్పి ముందు వెళుతున్న మోటార్ సైకిలిస్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మోహన్‌బాబును స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు మల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గణేష్ కుమార్ తెలిపారు.

సచివాలయం తనిఖీ

కోటనందూరు: గ్రామ స్థాయిలో ఈ నెల 15 నుంచి జరిగే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని కేపీ మల్లవరం గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయ పరిసరాలు, రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడలకు సంబంధించి రిజిస్ట్రేషన్ల వేగం పెంచాలన్నారు. క్రీడా ప్రాంగణాన్ని శుభ్రం చేయించి పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. క్రీడా పోటీల్లో విధిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పంపన జయలక్ష్మి పాల్గొన్నారు.

అన్నసమారాధన

గండేపల్లి: కార్తికమాసం ముగింపును పురస్కరించుకుని మండలంలోని మల్లేపల్లిలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

ఏలేశ్వరం: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ పట్టణంలో బుధవారం ఆర్టీసీ కార్మికులు ధర్నా చేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపో మెయిన్ గేటు వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు ఈపీఎఫ్ 95, సీపీఎస్‌లపై ఆప్షన్ నిలుపు చేసి ఉద్యోగి ఎప్పుడైనా ఆప్షన్ ఇచ్చుకొనే వెలుసుబాటు కల్పించాలన్నారు. పలు డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్‌కే రావు, కె.త్రిమూర్తులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

జగ్గంపేట: స్థానిక తపాలా కార్యాలయం వద్ద డాక్ సేవకులు చేస్తున్న సమ్మె రెండో రోజు బుధవారం కొనసాగింది. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని ఏఐజీడీఎస్‌ఈయూ సర్కిల్ ఉపాధ్యక్షుడు పేపకాయల వీర్రాజు కోరారు. డాక్ సేవకులకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, గ్రామాల్లో పని చేసే సిబ్బందికి 8 గంటల పనివిధానం అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ అడ్వైజర్ ఎ.సురేంద్రనాథ్, సీహెచ్ కేశవరావు, వి.అప్పలస్వామి నాయుడు, లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

గండేపల్లి/రౌతులపూడి/ప్రత్తిపాడు/జగ్గంపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరూతూ గండేపల్లి, జగ్గంపేట, ప్రత్తిపాడు, రౌతులపూడి తహసీల్దార్ కార్యాలయాల వద్ద బుధవారం అంగన్‌వాడీలు ఆందోళన చేశారు. నిరాహార దీక్షలు చేపట్టి నిరసన తెలిపారు. ప్రత్తిపాడు దీక్షా శిబిరాన్ని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం సందర్శించి మద్దతు ప్రకటించారు.

రైతులను ఆదుకోవాలని వినతి

ప్రత్తిపాడు: మిచాంగ్ తుపాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు రూ. 50 వేల నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ మేరకు భారతీయ జనతా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు శింగిలిదేవి సత్తిరాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. వరిపంటకు గిట్టుబాటు ధర చెల్లించాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, పంట రుణాలు రద్దు చేయాలని, విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని, పంట కాలువలు పూడిక తీయించి, మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకుడు ఇంటి వీర నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు కందా వీరాస్వామి, మదినే బాబ్జి, రెడ్డి లోవరాజు, చింతాకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

16న విద్యుత్ సమస్యల పరిష్కారంపై అవగాహన

తుని: స్థానిక రామకృష్ణ కాలనీలోని ఆదిత్య కళాశాలలో ఈ నెల 16న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ట్రాన్స్ కో ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి బుధవారం తెలిపారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ జరిగే ఈ కార్యక్రమంలో పరిష్కార వేదిక చైర్మన్ బి.సత్యన్నారాయణ, కమిటీ సభ్యులు వి.జనార్దనరావు, ఎస్.హరిబాబు, ఆర్. సురేంద్రకుమార్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పిస్తారన్నారు. 11.30 నుంచి 1.30 గంటల వరకూ వీరవరపుపేట ఏఈ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు.



ఎ.మల్లవరం సచివాలయం వద్ద డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



ఎస్.అన్నవరంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పి.అగ్రహారంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఒమ్మంగిలో అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



అన్నవరంలో పార్టీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

జగన్ పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- రామవరంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

జగ్గంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని రామవరంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ, అభివృద్ధి పనుల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఆయన ప్రారంభించారు. గ్రామ మెయిన్ సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నేత వి.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో జల జీవన్ మిషన్ పథకంలో నిర్మిస్తున్న రెండు వాటర్ ట్యాంకులను ఆయన పరిశీలించారు. ట్యాంకుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, పార్టీ మండలాధ్యక్షుడు వి.రామన్నదొర, పార్టీ నాయకులు బి.శివకుమార్, మండపాక సత్యనారాయణ, మాజీ సర్పంచ్ చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.



రామవరంలో డిజిటల్ బోర్డును ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు

తుని రూరల్: రాష్ట్రాన్ని ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తూనే అన్నివర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు అన్నారు. మండలంలోని ఎస్.అన్నవరంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రామాలయం వద్ద పార్టీ జెండాను ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూలతో కలసి ఆయన ఎగురవేశారు. అనంతరం జగన్నాథగిరి సచివాలయంలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఇంటింటా పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, నాయకులు కుసనం దొరబాబు, కీర్తి రాఘవ, వంగలపూడి కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

రౌతులపూడి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ప్రత్తిపాడు ఏఎంసీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ అన్నారు. మండలంలోని ఎ.మల్లవరంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద గత నాలుగన్నరేళ్లలో చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి పనుల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. స్థానిక కృష్ణుని ఆలయం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిందాడ పెదరాజు, బీబీ పట్నం సర్పంచ్ వడ్లళ్ల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నేత కాకి నాని పాల్గొన్నారు.

అన్నవరం: ప్రస్తుతం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. అన్నవరంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పార్టీ జెండాను ఎంపీపీ ఆవిష్కరించారు. సచివాలయం-2లో సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజాతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో శంఖవరం మండల వైస్ ఎంపీపీ ధారా వేంకట రమణ, ఉప సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, కొండపల్లి అప్పారావు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పి.అగ్రహారంలో వై ఏపీ నీడ్స్ జగన్

తొండంగి: మండలంలోని పి.అగ్రహారంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును వైఎస్ ఎంపీపీ నాగం గంగబాబు ఆవిష్కరించారు. మెయిన్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీ, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన నూకరాజు, గాబు రాజు, బత్తుల వీరబాబు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, మండల కన్వీనర్ పంచాది వీరబాబు అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. తొలుత సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును, ఆ గ్రామ ప్రధాన కూడలి వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యూత్ లీడర్ రామిశెట్టి బులిరామకృష్ణ, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, కొప్పన సుబ్బారావు, సుంకర సూరిబాబు, మామిడి నరసింహమూర్తి, రొంగల నాగేశ్వరరావు, కొప్పన రాంబాబు, గోపు వీరబాబు, సాదనాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కొండ పోడు పట్టాల పంపిణీ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- నెల్లిపూడిలో కొండపోడు పట్టాల పంపిణీ

శంఖవరం: రైతుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని నెల్లిపూడిలో రైతులకు బుధవారం కొండ పోడు పట్టాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రైతులకు పట్టాలు అదించడం ద్వారా భూమిపై శాశ్వత హక్కు లభిస్తుందన్నారు. అలాగే సాగుతో పాటు క్రయవిక్రయాలకు అవకాశం కలుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం, సర్పంచులు నరాల శ్రీలత, సకురు గుర్రాజు, పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, ధారా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



రాచపల్లిలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

గంగాలమ్మను దర్శించిన ఎమ్మెల్యే పర్వత

ప్రత్తిపాడు రూరల్: మండలం రాచపల్లిలో గంగలమ్మతల్లిని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగాణంలో నిర్వహించిన అన్నదానంలో పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలుశా, పూలమాలతో సత్కరించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు సారిపల్లి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



వీరలంకపల్లిలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. మండలంలోని వీరలంకపల్లిలో మండల పరిషత్ నిధులు రూ.15 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. మండలంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటివరకూ సుమారు రూ.2 కోట్ల మండల పరిషత్ నిధులు ఖర్చు చేశామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, ఉప సర్పంచ్ అల్లాడి రాంబాబు, నాయకులు దొడ్డా విజయ్, తొట్టా సత్యనారాయణ, కార్యదర్శి టంకాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ప్రతిభను ప్రోత్సహించాలి



తొండంగి భవిత కేంద్రంలో దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న వైస్ ఎంపీపీ గంగబాబు

తొండంగి: దివ్యాంగుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించాలని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా తొండంగి భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పలు పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు బుధవారం వైస్ ఎంపీపీ నాగం గంగబాబు బహుమతులు అందజేశారు. ఎంఈఓ షేక్ బాబ్జి, పార్టీ నాయకులు దడాల విజయ్, గాబు రాజు పాల్గొన్నారు.

22న మండల సమావేశం

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22న మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ బుధవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన ప్రారంభమయ్యే సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చిస్తారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ప్రజారోగ్యం

ప్రత్తిపాడు: రసాయన ఎరువులతో పండించిన ఆహార పదార్థాలు తినడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు వస్తున్నాయని, ప్రకృతి వ్యవసాయంతోనే ప్రజారోగ్యం సాధ్యమని ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఎలియాజర్ అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం సెర్ప్, ప్రకృతి వ్యవసాయం సమన్వయంతో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం ఎలియాజర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. రసాయన మందుల ప్రభావంతో వ్యవసాయ భూమి చౌడు బారుతుందన్నారు. తిరిగి సారవంతమైన భూమిగా మార్చుకోవడానికి ప్రకృతి వ్యవసాయమే శరణ్యమన్నారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని సెర్ప్ డీపీఎం వెంకటేశ్వరరావు కోరారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఐ.కాంచన, జి.సంధ్యారాణి, వైఎస్సార్ కాంతిపథం ఏపీఎం వై.వెంకట్, ఏడీపీఎం సత్యనారాయణ, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ లోవకుమారి, కె స్వప్న, మాష్టర్ ట్రైనర్ మూరా చినబాబు, ఎంటీఎల్ వర్మ తదితరులు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. వీఓఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఎలియాజర్

ప్రజలందరికీ రక్షిత తాగునీరు

తుని రూరల్: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఎస్.అన్నవరం ఎస్సీపేటలో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటా తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసే పనులకు బుధవారం ఆయన భూమి పూజ చేశారు. జల్ జీవన్ మిషన్ పథకంలో 106 కుటుంబాలకు పైసా ఖర్చు లేకుండా వంద శాతం రాయితీపై తాగునీటి కుళాయిలు అమర్చుతున్నట్టు తెలిపారు. తాగునీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయని తెలిపారు. జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, ఎంపీటీసీ వంగలపూడి అప్పారావు, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, నాయకులు గారా శ్రీనివాసరావు, కుసనం దొరబాబు, కార్యదర్శి మధుశేఖర్ పాల్గొన్నారు.



ఎస్.అన్నవరంలో జల్ జీవన్ మిషన్ పనులకు భూమి పూజ చేస్తున్న నాయకులు

పట్టణాభివృద్ధికి పెద్దపీట

తుని: పట్టణాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 30 వార్డులో బుధవారం రూ. 20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని పార్కులు, డ్రైన్లు, సీసీ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పడిన తరువాత పట్టణంలో ఇప్పటివరకూ 99 సీసీ రోడ్లు నిర్మించామన్నారు. త్వరలో 100వ సీసీ రోడ్డును మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు, వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, కౌన్సిలర్ సిద్ధిరెడ్డి గౌరీవనజ, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు పాల్గొన్నారు.



తునిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

సారా స్థావరాలపై దాడులు

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో సారా స్థావరాలపై బుధవారం ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సిబ్బంది దాడి చేశారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. సంఘటన స్థలం నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకని, అదే గ్రామానికి చెందిన అల్లు కృష్ణంరాజును అరెస్టు చేశామన్నారు. ఈ దాడిల్లో ఎస్ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు, హెచ్‌సీలు కృష్ణార్జున, వెంకన్నదొర, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రత్తిపాడు: మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బుధవారం ప్రత్తిపాడు సీఐ కె.శేఖర్ బాబు పరిశీలించారు. ప్రత్తిపాడులో ఎనిమిది, ఏలూరులో నాలుగు, రాచపల్లిలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలు, పోలింగ్ నిర్వాహణకు అనుకూలం, రక్షణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ టి.శ్రీనివాసరావు, ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్, వీఆర్వోలు ఉన్నారు.

వైభవంగా పోలి స్వర్గం వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ముగిసిన కార్తిక మాసం

ఏలేశ్వరం: పోలామావాస్య వేడుకలను బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. తెలవారుజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక శివాలయం సమీపంలోని ఏలేరు నదిలో మహిళలు అరటి డొప్పల్లో దీపాలు వెలిగించి వదిలి పెట్టారు. బ్రాహ్మణులకు స్వయంపాకం ఇచ్చి పూజలు చేశారు. శివాలయంలోని ధ్వజస్తంభం, శివలింగం వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. లింగంపర్తి, సిరిపురం శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాగా నెల రోజుల పాటు నిర్వహిస్తున్న కార్తిక మాస సంబరాలు బుధవారంతో ముగిశాయి.

అన్నవరం: కార్తికమాసం ముగింపును పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజామున స్థానిక పంపా నదిలో మహిళలు దీపాలను విడిచి పెట్టారు. పోలి స్వర్గం సందర్భంగా స్థానిక పవర్ ఆఫీసు వద్ద గల పంపాఘాట్‌లు, పంపా సత్రం వెనుక గల పంట కాలువల వద్ద భక్తుల సందడి నెలకొంది. మహిళలు వెలిగించిన దీపాలతో నదీతీరాలు ప్రకాశించాయి. శివాలయంలో స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఘాట్‌రోడ్ వద్ద వినాయకుడు, నేరేళ్లమ్మతల్లి, రైల్వేస్టేషన్ వద్ద మరిడమ్మతల్లి ఆలయాలను దర్శించడంతో అక్కడ తీవ్ర రద్దీ నెలకొంది.



తాళ్లూరు జీయ్యన్న మఠంలో పూజలు చేస్తున్న మహిళలు



ఏలేరు నదిలో దీపాలు వదులుతున్న భక్తులు

గండేపల్లి: పోలి పాడ్యమి వేడుకలను బుధవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. తాళ్లూరు జీయన్న మఠంలోని గజేంద్రమోక్ష పుష్కరిణిలో భక్తులు తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించారు. పండితులకు స్వయంపాకాలు అందజేసి స్వామివారిని దర్శించుకున్నారు. కార్తిక మాసం ముగింపును పురస్కరించుకుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

శంఖవరం: మండల వ్యాప్తంగా బుధవారం పోలి స్వర్గం (పోలి పాడ్యమి) వైడుకలు వైభవంగా జరిగాయి. తెలవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళలు చెరువులు, కాలువల్లో దీపాలు వదిలారు. కాగా కార్తిక మాసోత్సవాలు బుధవారంతో ముగిశాయి.

కార్తిక మాసానికి వీడ్కోలు

ప్రత్తిపాడు: కార్తిక మాసం ముగిసింది. చివరి రోజు బుధవారం పోలి పాడ్యమిని ఘనంగా నిర్వహించారు. భక్తులతో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. స్థానిక పుష్కర కాలువ, చెరువులు, కాలువల వద్ద మహిళలు పూజలు చేసి కార్తిక దీపాలను వదిలిపెట్టారు. స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి పంచాయతన క్షేత్రంలో ఆలయ ప్రధానార్చకుడు కొత్తలందక సాయి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



కత్తిపూడి కోనేరులో దీపాలు వదులుతున్న భక్తులు



అన్నవరం పంపా కాలువ వద్ద భక్తుల సందడి

గౌరీదేవికి సారె సమర్పణ

ప్రత్తిపాడు: కిర్లంపూడి మండలం గెద్దనాపల్లిలో బుధవారం గౌరీదేవికి సారె సమర్పణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మహిళలు, యువతులు తమ ఇళ్లలో వండిన పలురకాల వంటకాలు, మిఠాయిలు, పండ్లు తదితర నైవేద్యాలను శిరస్సున దాల్చి, గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. రామాలయంలో ప్రతిష్ఠించిన గౌరీ దేవికి నైవేద్యం సమర్పించారు. ఈ సంబరంలో గెద్దనాపల్లి, భూపాలపట్నం తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గెద్దనాపల్లిలో గౌరీదేవి అమ్మవారికి సారె తీసుకువెళుతున్న మహిళలు